Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 286 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :286 | గురువారం 16 అక్టోబర్ 2025 | వెల : 3 | పేజీలు : 4

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి సెల్ : 9440815774

## కర్నూలుకు ప్రధాని మోదీ

- ప్రధాని మోదీ పర్యటనపై ఎంపీ, ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్
- భద్రత కట్టుదిట్టం చేసిన యంత్రాంగం
- పర్యటన ఏర్పాట్లపై సమీక్షించిన పలువురు మంత్రులు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, కర్నూలు**

ప్రధాని నరేంద్ర మోదీ గురువారం కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం వెళ్లి అక్కడ స్వామివార్లను దర్శించుకుంటారు. మొక్కుల అనంతరం కర్నూలు చేరుకొని 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్" భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సందర్భంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఏర్పాట్లపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి - మిగతా3లో





## 2040లో చందమామపైకి భారత వ్యోమగామి

- ఇస్రో చీఫ్ నారాయణన్
- 2027లో చేపట్టబోయే మానవసహిత అంతరిక్షయాత్ర మిషన్ ట్రాక్‌లో ఉంది
- 2040 నాటికి తొలి మానవసహిత చంద్రయానం చేపట్టాలని ప్రధాని దిశానిర్దేశం చేశారు
- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారేందుకు అంతరిక్ష కార్యక్రమంలో ఈ యాత్ర కీలకపాత్ర పోషిస్తుంది

## ఏపీ బ్రాండ్ పునరుద్ధరణతోనే భారీ పెట్టుబడులు



- విశాఖలో గూగుల్ డాటా సెంటర్ దేశానికే తలమానికం
- గూగుల్ పెట్టుబడుల వెనుక ఐటీ మంత్రి లోకేష్ కీలక పాత్ర
- అధికారంలోకి వచ్చిన వెంటనే గూగుల్ సంస్థను సంప్రదించారు
- ఏఐ డాటా సెంటర్‌తో విద్య, వైద్యం, వ్యసాయం సహా అనేక రంగాల్లో కీలక మార్పులు
- గూగుల్ ఇన్వెస్టిమెంట్‌పై శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సీఎం చంద్రబాబు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఏపీ బ్రాండ్ పునరుద్ధరణతోనే 16 నెలల్లో భారీ పెట్టుబడులు సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గూగుల్ డాటా సెంటర్ ఏర్పాటు ఏపీ చరిత్రలోనే కాకుండా...దేశ ఐటీ చరిత్రలోనే ఇదొక పెద్ద మలుపు కానుందని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ దశ దిశ నాడు మైక్రోసాఫ్ట్‌తో మారిందని....నేడు ఏపీలో గూగుల్ డాటా సెంటర్ ఆ పాత్ర పోషిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీకి గూగుల్ డాటా సెంటర్ రావడంలో ఐటీ మంత్రి లోకేష్ కీలక పాత్ర పోషించారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గూగుల్ - మిగతా3లో



## ప్రాణాంతక ఇంజెక్షనా? ఉరిశిక్షా?

- ఆప్షన్ ఇవ్వలేమన్న కేంద్రం
- కాలానుగుణంగా మార్పులను తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధంగా లేకపోవడమే ఇక్కడ సమస్య
- "అమెరికాలోని 49 రాష్ట్రాలు మరణశిక్ష అమలులో ప్రాణాంతక ఇంజెక్షన్ విధానాన్ని అనుసరిస్తున్నాయి

## భారత్‌పై పనిచేయని టారిఫ్

- డొనాల్డ్ ట్రంప్ భారత్ మీద 50 శాతం టారిఫ్ అమలు చేస్తున్నారు
- ఆయన విధించిన టారిఫ్‌లు భారతదేశ జీడీపీ వృద్ధిపై ఎలాంటి ప్రభావం చూపడం లేదు
- అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారతదేశ స్థూల దేశీయ ఉత్పత్తి వృద్ధి రేటు అంచనాను 6.6 శాతానికి పెంచింది
- మొదటి త్రైమాసికంలో బలమైన ఆర్థిక వృద్ధితో ఈ అంచనా పెరిగింది



## 57 మంది అభ్యర్థులతో జేడీయూ తొలి జాబితా

- సీట్ల కేటాయింపు విషయంలో నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌ఎడీఏ)లో తర్జన భర్జనలు
- ఈ జాబితాలో పలువురు సీనియర్ నేతలు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు
- రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న విజయ్ కుమార్ చౌదరి.. సరాయ్ రంజన్ నుంచి పోటీ చేయనున్నారు



## చంద్రబాబు దుర్మార్గాలను గట్టిగా ఎదుర్కోవాలి

- పార్టీ సంస్థాగత నిర్మాణంపై వైఎస్ జగన్ ఆలోచనలు, బ్లూ ప్రింట్‌ను మనం అమలు చేయాలి
- వైఎస్సార్సీపీ అనుబంధ విభాగాలన్నీ చిత్తశుద్ధిగా పనిచేయాలి
- "మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల ఏపీలోని అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా చంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేస్తోంది.
- ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాలి, ఈ దుర్మార్గాలను ఆపగలగాలి



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తాడేపల్లి**

"వైఎస్సార్‌సీపీకి 18 నుంచి 20 లక్షల మంది క్షేత్రస్థాయి క్రియాశీల నాయకత్వం ఉంది.. పార్టీ సంస్థాగత నిర్మాణంపై వైఎస్ జగన్ ఆలోచనలు, బ్లూ ప్రింట్‌ను మనం అమలు చేయాలి అని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్సీపీ అనుబంధ విభాగాలన్నీ చిత్తశుద్ధిగా పనిచేయాలన్నారు. ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం.. అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు లేళ్ళ అప్పిరెడ్డి, ఆలూరు సాంబశివారెడ్డి సహా - మిగతా3లో

### చిత్తడి నేలల గుర్తింపు... సంరక్షణతో పర్యాటక

## అభివృద్ధికి శ్రీకారం



- ఒకేసారి 16 చిత్తడి నేలల గుర్తింపు రాష్ట్రానికి గర్వకారణం
- చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియలో సరికొత్త చరిత్ర సృష్టించబోతున్నాం
- సోంపేట చిత్తడి నేలల్లో టూరిజం కారిడార్
- వీరాపురం, పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పక్షి సంరక్షణ కేంద్రాలు
- కొల్లేరు లేక్ మేనేజ్మెంట్ అథారిటీకి ప్రతిపాదనలు
- స్టేట్ వెట్ ల్యాండ్ అథారిటీ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

'చిత్తడి నేలల సంరక్షణ భావితరాల భవిష్యత్తుకు అవసరం. పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెరుగుదల, పర్యాటక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టామ'ని రాష్ట్ర ఉపముఖ్య మంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 16 చిత్తడి నేలలను గుర్తించి, వాటి - మిగతా3లో



## వ్యూహకర్త వ్యూహం.. సొంతింట్లో క్లిక్ అవుతుందా?

- ఎన్నికల విషయంలో మునుపటి అనుభవం, పుట్టిన నేలపై అభిమానంతో ముందుకెళ్తున్నారు
- ఈ ఎన్నికల్లో పీకే గేమ్ ఛేంజర్ అవుతారా? లేదా? అనే విషయం ఆసక్తిగా మారింది.
- సరికొత్త రాజకీయ పంథాతో బిహారీల్లో ఆశలు చిగురించే ప్రయత్నం చేస్తున్నారు పీకే

## సమిష్టి కృషివల్లే రాష్ట్రానికి గూగుల్ రాక



- అందరం గర్వపడాల్సిన సమయం
- 20లక్షల ఉద్యోగాల సాధనకు కట్టుబడి నిరంతరం శ్రమిస్తున్నాం
- ఇకపై ప్రాజెక్టులకు సంబంధించి ప్రతివారం ఎనౌన్స్ మెంట్లు ఉంటాయి
- 17నెలల్లో ఇన్వెస్టిమెంట్ ఎట్రాక్ట్ స్టేట్ గా ఆంధ్రప్రదేశ్ ను తయారుచేశాం
- గూగుల్ వాళ్లకు కూడా రాష్ట్రానికి రావద్దని మెయిల్లు పెట్టారు....
- వైసిపి రాష్ట్రానికి హానికరం... వారి వల్ల అంతా విధ్వంసమే
- విలేకరుల సమావేశంలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్

## అభివృద్ధి కార్యక్రమాలు చేయడం నా కర్తవ్యం

### ఎమ్మెల్యే డాక్టర్ థామస్



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్15:**
గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ అభివృద్ధి నా కర్తవ్యం నా పని నేను చేసుకుంటూ వెళ్తా మొరిగే కుక్కలకి సమాధానం చెప్పవలసిన అవసరం నాకు లేదు అని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. బుధవారం గంగాధర్ నెల్లూరు మండలం సిడిపిఓ కార్యాలయంలో అంగన్వాడి కేంద్రంలో ఫుడ్ మేళాను పరిశీలించి ఫుడ్ టెస్ట్ ను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పరిశీలించారు.. ఇక్కడ అన్ని వంటలు ఫుడ్ ఐటమ్స్ చాలా బాగున్నాయి ఇవి పౌష్టికాహారం ఇవి పిల్లలు తప్పనిసరిగా తీసుకుంటే వారికి ఆరోగ్యంగానూ ఉంటారు తెలివిపరులుగా ఉంటారు... గతంలో అన్ని ఆరోగ్యకరమైన వంటలు తింటూ ఆరోగ్యంగా 100 సంవత్సరాలు కూడా జీవించారు ప్రస్తుతం అన్ని వస్తువుల్లో కల్తీ రావడం పౌష్టికం తగ్గడం వల్ల వివిధ రోగాలు వస్తున్నాయి కావున అందరూ పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చు అని తెలియజేశారు అనంతరం తమిళనాడు సూపర్ స్టార్ రజినీకాంత్ డైలాగ్ "ఆరవని కుక్క లేదు, కొరత చెప్పని నోరు లేదు ఈ రెండు లేని ఊరు లేదు మన పని మనం చేసుకుంటే వెళ్లడమే అర్థమైందా రాజా" అని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ రజనీకాంత్ డైలాగ్ చెప్పడంతో సమావేశంలో అందరూ కేరింతలతో చప్పట్లతో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సార్‌ను అభినందించారు.. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పద్మ సునంద, జనసేన ఇంచార్జ్ యుగంధర్ బిజెపి ఇన్చార్జ్ రాజేంద్రన్ మండల పార్టీ అధ్యక్షుడు స్వామి దాస్ ప్రకృతి షెల్టర్ చైర్మన్ పాలసముద్రం టిడిపి నాయకుడు తాళ్లూరు శివ, పెరుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయుడు యాదవ్ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ పెనుమూరు మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు.. మర్రిపల్లి మోహన్ నాయుడు, సాఫ్ట్వేర్ బాలు పైనేని మురళి, ధనుంజయ నాయుడు కిరణ్ ,ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం షాదీఖానా డైరెక్టర్లు

### అబ్దుల్ గఫూర్, షానాజ్‌కు సన్మానం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,అక్టోబర్ 15:**
కుప్పంమండలం రాగిమానుమిట్టకు చెందిన అబ్దుల్ గఫూర్, కుప్పం మున్సిపల్ మోడల్ కాలనీకు చెందిన షానాజ్‌ను కుప్పం షాదీఖానా డైరెక్టర్లుగా ఎన్నుకోవడం పై ఆనందం వ్యక్తం చేస్తూ స్థానిక టిడిపి నాయకులు గని ఉల్లా, అల్లా బగష్, నబీ, ఉమర్, జమీర్ తదితరులు అబ్దుల్ గఫూర్, షానాజ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షాదీఖానా డైరెక్టర్లు అబ్దుల్ గఫూర్, షానాజ్ మాట్లాడుతూ.. తనను నమ్మి షాదీఖానా డైరెక్టర్లుగా బాధ్యతలు ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నంలకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే తమ ఎంపికకు సహకరించిన టిడిపి నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

## బలిజకండిగా టు బెంగళూరు

### నూతన వెన్ సన్ బస్సును ప్రారంభించిన

### ప్రభుత్వ విప్ ఎంఎల్ఏ డాక్టర్ థామస్



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 15:**
బలిజ కండిగ టు బెంగళూరు నూతన వెన్ సన్ బస్సును ప్రభుత్వ విప్ గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రారంభించారు. బుధవారం గంగాధర్ నెల్లూరు మండలం అల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి జండా ఊపి ప్రారంభించి అనంతరం నూతన బస్సును ఎమ్మెల్యే డాక్టర్ థామస్ డ్రైవింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి మహానగరం బెంగళూరులో గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో పాలసముద్రం మండలం గంగాధర్ నెల్లూరు మండలం చెందిన చాలామంది బెంగళూరులో స్థిరపడ్డారు. వీరి కోసం ప్రత్యేకంగా సొంత గ్రామాల నుంచి బస్సు ఏర్పాటు చేయడం వారికి ఎంతో ఉపయోగం,అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి షెల్టర్ చైర్మన్ పాలసముద్రం టిడిపి యువ నాయకుడు, తాళ్లూరి శివ, పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమ నాయుడు, యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్,మహేష్ నాయుడు, దేవపత్ని, ధనుంజయ నాయుడు, పాలసముద్రం మండలం టిడిపి మహిళా నాయకురాలు ఇందిరమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు స్వామి దాసు, జనసేన ఇన్చార్జి యుగంధర్, బిజెపి ఇన్చార్జ్ రాజేంద్రన్, సాఫ్ట్వేర్ బాలు, పైనేని మురళి, ప్రసాద్, దేవపత్ని కిరణ్, ఆర్ముగం, బుజ్జి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



### ఏపీ ఐఐసి ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్

## పోస్టర్ విడుదల



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 15:**
చిత్తూరుజిల్లా పరిధిలో పరిశ్రమల ఆధుని కీకరణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల అభివృద్ధి, శుభ్రత కార్యక్రమాలను ప్రోత్స హించే దిశగా ఏపీ ఐఐసి ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ భాగంగా విస్తృత కార్య క్రమాలు ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని కలెక్టర్ ఛాంబర్లో ఏపీఐఐసి ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల వృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమానంగా ముందుకు సాగాలని ఇందులో భాగంగా జిల్లా పరిధిలో పరిశ్రమల ఆధునికీకరణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల అభివృద్ధి, శుభ్రత కార్యక్రమాలను ప్రోత్సహించే దిశగా ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్‌ను అక్టోబర్15నుండి నవంబర్ 15 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరిశ్రమల మౌలిక సదుపాయాల ఆధునీకరణ, స్థిరమైన అభివృద్ధి చర్యలు, పరిశ్రమలు పెట్టుబడుల ప్రోత్సాహ కార్యక్రమాలు, శుభ్రత పారిశుధ్య డ్రైవ్, మొక్కలనాటే కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా పరి శ్రమల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, శుభ్రమైన పారిశ్రామిక వాడలు స్థాపన, పెట్టుబడిదారుల సహకారం ద్వారా పరిశ్రమల వృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పరిశ్రమల అభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసి చిత్తూరు జోనల్ మేనేజర్ వైవికె సుబ్బారావు, డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ జనరల్ మేనేజర్ సూరిబాబు, పారిశ్రామికవేత్త సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### డాక్టర్ వైయస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

## రెండవ దశ జీఎస్టీ 2.0 అవగాహన కార్యక్రమం



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్15:**
డా.వై.ఎస్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెదురుకుప్పంలో జీఎస్టీ 2.0 రెండవ దశ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.అన్నపూర్ణ శారద అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.విద్యార్థుల్లో పన్నుల విధానం,జీఎస్టీ ప్రాముఖ్యత,ప్రభుత్వ ఆర్థిక విధానాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాణిజ్య విభాగా ధిపతి జీఎస్టీ 2.0 యొక్కకొత్త మార్పులు, వ్యాపార వృద్ధి పై దాని ప్రభావం,డిజిటల్ ట్యాక్స్ వ్యవస్థ సౌలభ్యాల సౌలభ్యాల గురించి ఎకనామిక్స్ లెక్చరర్ డాక్టర్.డి లావణ్య కుమారి వివరించారు. అనంతరం విద్యార్థులకోసం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, ఫోటో ప్రదర్శనలు కూడా నిర్వహించబడ్డాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చివరగా కళాశాల ప్రాంగణం నుండి భారతం మిట్ట సర్కిల్ వరకు జిఎస్టి 2.0పై నినాదాలతో మానవహారం చేశారు.ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ సమన్వయకర్త, ఎనఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## పంచాయతీల ఆదాయ వనరులు పెంచాలని సూచన



**పెనుమూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 15:**
గ్రామ పంచాయతీల ఆర్థిక స్థిరత్వం కోసం స్థానిక వనరులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. మండల పరిధిలోని సర్పంచులు, కార్యదర్శులు, పంచాయతీ సిబ్బందికి ఆదాయ వనరుల సృష్టి, వాగులు,వంకలు, చెరువులు, ప్రభుత్వ భూముల సంరక్షణ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ... "ప్రతి పంచాయతీకి స్వంత ఆదాయం ఉండేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ భూములను కాపాడి, చెరువులు, వాగులు, వంకలను సంరక్షిస్తే పంచాయతీకి మంచి ఆదాయం వస్తుంది. చేపలు పెంపకం, లీజ్‌లు, వృక్షారోపణ వంటి కార్యక్రమాలు ఆదాయ వనరులుగా మారాలి" అని సూచించారు. ఆదాయ వనరుల సృష్టి ద్వారా పంచాయతీ అభివృద్ధి వేగవంత మవుతుందని పేర్కొన్నారు.శిక్షణ కార్యక్ర మంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## కుప్పం ఇంజినీరింగ్ కాలేజీలో

### డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 15:**



కుప్పం ఇంజినీరింగ్ కాలేజీలో మిసైల్ మాన్, భారత మాజీ రాష్ట్రపతి,ప్రజల ప్రియ నాయకుడు డా.ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాలే జ్ వ్యవస్థాపక అధ్య క్షులు డా.బి.సి. నాగరాజ్, ప్రిన్సిపాల్ డా.ఎస్. సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా.ఎస్. భాస్కరన్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జె. మాధవన్, గంగాధర్, వివిధ విభాగాల విభాగాధి పతులు, అధ్యాపకులు, విధ్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు డా.కలాం జీవితంలో నుంచి ప్రేరణ తీసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు.

## ఇంటి పట్టాలు తీసిస్తామంటూ

### లక్షలు వసూలు చేసి పారిపోయిన విఆర్వో




**పెద్దపంజాణి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్15:**
మండలంలో పనిచేసిన విఆర్ఓ ఇంటి పట్టాలు ఇప్పిస్తామంటూ వసూలు చేసి పారిపోయిన వైనం, ప్రస్తుతము చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం చలమంగళం గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న ఈశ్వరయ్య, గతంలో చౌడేపల్లి మండలం, దిగువపల్లి గ్రామ పంచాయతీ విఆర్ఓగా విధులు నిర్వహిస్తూ ప్రజల వద్ద ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ లో ఇంటి పట్టాలు ఇస్తామని ముగ్గురు మహిళలను నమ్మించి వారి వద్ద నుండి సుమారు మూడులక్షలు వసూలు చేశాడని వారు వాపోయారు.అంతే కాకుండా చాలా మంది దగ్గర పట్టా మార్పిడి చేస్తామని, పాసుపుస్తకాలు చేయిస్తామని, వన్‌బి చేయిస్తామని లక్షల్లో వసూలు చేసినట్లు తెలుస్తుంది.ఈ విషయం పైన ఎన్నోసార్లు పెద్దపంజాణి మండలం తాహాశిల్దార్ కార్యాలయం వద్దకు వెళ్ళి మహిళలు అతన్ని అడుగగా, అన్నీ అయిపోయాయి, ఇక తాహాశిల్దార్ సంతకాలు మాత్రమే పెండింగ్ ఉన్నాయంటూ నమ్మబలికి గతంలో ప్రస్తుత పెద్దపంజాణిలో పనిచేస్తున్నటువంటి తాహాశిల్దార్ గతంలో చౌడేపల్లిలో పనిచేశారు. కాబట్టి అతని వద్ద సంతకాలు చేయిస్తానని మళ్ళీ డబ్బులు వసూలు చేశాడు. ఇతని బాదితులు చౌడేపల్లి మండలంలో సుమారు ఇరవై నుండి ముప్పై మందికి పైనే ఉన్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్దామంటే ఈ రోజు అయిపోయింది, అంటూ కాలయాపన చేస్తూ వచ్చాడు.ప్రస్తుతం గట్టిగా అడుగ్గానీ దిక్కున్న చోట చెప్పుకో అంటున్నారని బాదితులు తెలియజేశారు. ఇటువంటి గ్రామ రెవిన్యూ అధికారి వలన రెవిన్యూ వ్యవస్థకే చెడ్డపేరు వస్తుందని, వెంటనే సదలు విఆర్ఓ ఈశ్వరయ్యను విధుల నుండి శాశ్వతంగా తొలగించి, బాదితుల వద్ద తీసుకున్న డబ్బులు అతని పియఫ్ నుండి జమ చేయాలని వారు కోరడమైనది.

## ప్రాణాలు కోల్పోయిన విద్యార్థి

### కుటుంబానికి న్యాయం చేయాలి



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 15:**
అన్నమయ్యజిల్లాపీలేరు అభ్యుదయ పాఠశాలలో జరిగిన, విషాద ఘటనలో విద్యార్థి సాయి కిరణ్ ప్రాణాలు కోల్పోవ డానికి పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఎన్.ఎస్. యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమృత్ తేజ అన్నారు. విద్యార్థుల భద్రతను కాపాడాల్సిన బాధ్యత ఉన్న పాఠశాలలు లాభాపేక్షతో నడుస్తున్నాయి, చిన్నారి ప్రాణాలు కోల్పోయినా యాజమాన్యం తీరు మారడం లేదని అభ్యుదయ పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యూ.ఐ జిల్లా అధ్యక్షులు సాయి సంపత్, విద్యార్థి నాయకులు లోకేశ్, ఇమ్రాన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ శాంతీపురమే లక్ష్యం- స్వచ్ఛ అవార్డు గ్రహీతలకు సన్మానం

**శాంతీపురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 15:**





రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ గ్రామ పంచాయతీ అవార్డు పొందినందులకు గాను బుధవారం కెనమాకులపల్లెగ్రామ సచివాలయములో అవార్డు గ్రహీతలకు మండలములోని ప్రజా ప్రతి నిధులు, అధి కారులు ఘనంగా సత్కరించారు. ఈ సంధర్భముగా ఎంపీడీఓ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ మేరకు శాంతీపురం మండలములోని అన్ని గ్రామాలను చెత్తర హిత గ్రామాలుగా తీర్చిదిద్ది స్వచ్ఛ శాంతీపురమే లక్ష్యముగా పనిచేస్తామని, ప్రభుత్వ విప్, శాసన మండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్ జిల్లా కలెక్టరు, చిత్తూరు, ప్రాజెక్టు డైరెక్టరు, కడ, కుప్పం పర్యవేక్షణలో స్వచ్ఛ శాంతీపురముగా తయారుచే స్తామని ఎంపీడిఒ తెలిపారు.ఈ సందర్భముగా మాజీ శాసనమండలి సభ్యులు గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా కలిసి మండలమును అభివృద్ధి పథంలో నడింపించాలని కోరారు. అలాగే అవార్డు గ్రహీతలైన సర్పంచు ఎ.వి. జయరాం, పంచాయతీ కార్యదర్శి స్వాతిని, ఎంపీడీఓను ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు ఉదయ్ కుమార్, మాజీ మండల టీడీపీ అధ్యక్షులు విశ్వనాథనాయుడు, క్లస్టర్ ఇంచార్జ రాజేంద్ర, మాజీ క్లస్టర్ ఇంచార్జ చంద్ర, ఏ.ఎమ్‌సీ. మాజీ డైరెక్టర్ నాగరాజు, శంకర్, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు రేపటికి మార్గదర్శి కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళా

**రేణిగుంట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 15 :**




రైతలన్నలకు నూతన వ్యవసాయ సాంకే తికతలు, మెరుగైనవిత్తనాలు, సమర్థవంతమైన యాజమాన్య పద్ధతులు అందించడమే "కిసాన్ మేళ" ముఖ్య ఉద్దేశమని పశు వైద్య విశ్వవి ద్యాలయ ఉపకులపతి డాక్టర్ జె.వి రమణ, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, శ్రీనివాసులు అన్నారు. రేణిగుంట మండలంలోని కరకం బాడి పంచాయతీ పంచాయతీ రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఆత్మ వ్యవసాయ సాంకేతిక సంస్థఆధ్వర్యంలో కిసాన్ మేళా కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు ఉమ్మడి జిల్లా 450కి పైగా రైతులు, వ్యవ సాయ విద్యార్థులు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పశు వైద్య విశ్వవిద్యా లయం, కిసాన్ నుంచి శాస్త్రవేత్తలు, జిల్లావ్యవసాయశాఖ సంబంధించిన అధికారులు కార్యక్ర మంలో పాల్గొని రైతులకు నూతన యాజమాన్య పద్ధతులను రబీ కాలంలో సాగు చేసే పంటల లో కొత్తరకం విధానాలు నూతన యాజమాన్యం పద్ధతులపై అవగాహన కల్పించారు.

# చిత్తడి నేలల గుర్తింపు... సంరక్షణతో పర్యాటక అభివృద్ధికి శ్రీకారం

-మొదటిపేజీ తరువాయి

పరిరక్షణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దక్షిణ భారతదేశ చరిత్రలో ఒకేసారి ఇంత పెద్ద ఎత్తున చిత్తడి నేలలకు గుర్తించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర సృష్టించబోతోందని తెలిపారు. అందులో సోంపేట, తవిటి మండలాల పరిధిలో వేలాది ఎకరాల్లో విస్తరించి వున్న మూడు చిత్తడి నేలలను అనుసంధానిస్తూ భారీ పర్యాటక ప్రాజెక్టుకు రూపకల్పన చేయనున్నట్టు తెలిపారు. కొల్లేరు మాదిరిగా మరిన్ని చిత్తడి నేలలకు రాంసర్ గుర్తింపు దక్కేలా అటవీ శాఖ వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో చర్యలు చేపడతామని చెప్పారు.

మంగళవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్ కళ్యాణ్ అధ్యక్షతన స్టేట్ వెట్ ల్యాండ్ అథారిటీ సమావేశం జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా చిత్తడి నేలల భౌగోళిక సరిహద్దుల గుర్తింపు, అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "సుప్రీం కోర్టు ఆదేశాలకు లోబడి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చిత్తడి నేలల భౌగోళిక గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా 23,450 చిత్తడి నేలలు ఉన్నాయి. అందులో 99.3 శాతం నేలలకు డిజిటల్ సరిహద్దుల గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యింది. వీటికి ఈ నెల 28 లోపు భౌతిక సరిహద్దుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. అందుకోసం అటవీ శాఖ, రెవెన్యూ, సర్వే విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి ఆ ప్రక్రియను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి.పోరాటయాత్రలో సోంపేట చిత్తడి నేలలను పరిశీలించానుచిత్తడి నేలల గుర్తింపు, అభివృద్ధి ప్రక్రియలో అన్ని రాష్ట్రాల కంటే మనం ముందున్నాం. రాష్ట్ర పరిధిలో ఒకేసారి 16 చిత్తడి నేలలకు టెక్నికల్, గ్రీవెన్స్ కమిటీ ఆమోదం లభించింది. వీటిని అధికారికంగా గుర్తిస్తూ నోటిఫై చేయబోతున్నాం. దక్షిణ భారత దేశ చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున ఒకేసారి చిత్తడి నేలలకు గుర్తింపు ఇచ్చి చరిత్ర సృష్టించబోతున్నాం. అందులో సోంపేట, తవిటి మండలాల పరిధిలో 5 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న పెద్ద బీల, చిన బీల, తుంపర, చిత్తడి నేలలను ఒక కారిడార్ గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. 2018లో పోరాట యాత్ర సందర్భంగా సోంపేట



ప్రాంతంలో చిత్తడి నేలలను పరిశీలించాను. పర్యవేక్షణ లేక పేద బీల, చిన బీల ప్రాంతం ఆక్రమణలకు గురైన విషయం స్థానికులు నా దృష్టికి తీసుకువచ్చారు. అధికారంలోకి వస్తే ప్రకృతి ప్రసాదితమైన ఆ చిత్తడి నేలలకు రక్షణ కల్పించడంతోపాటు అభివృద్ధి చేయాలని భావించాము. అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా సోంపేట చిత్తడి నేలలకు అధికారిక గుర్తింపు తీసుకువచ్చే చర్యల్లో భాగస్వామి కావడం ఆనందంగా ఉంది. పెద బీల, చిన బీల, తుంపర కలిపి వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న చిత్తడి నేలల గుర్తింపు ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తాం. ఎకో టూరిజం అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. అనంతపురం జిల్లా పరిధిలోని వీరాపురం, రాజమండ్రి సమీపంలోని పుణ్యక్షేత్రంలో విస్తరించి ఉన్న చిత్తడి నేలలు అరుదైన పక్షి జాతులకు నెలవుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రత్యేక పక్షుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షించే విధంగా చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలోనే అతిపెద్ది చిత్తడినేలగా రాంసర్(అంతర్జాతీయ) గుర్తింపు పొందిన కొల్లేరు లాంటి సరస్సుల పరిరక్షణపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కొల్లేరు చిత్తడి నేల పరిరక్షణ కోసం అటవీశాఖ వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో 'కొల్లేరు లేక్ మేనేజ్మెంట్ అథారిటీ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించాను. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన మిగిలిన చిత్తడి నేలలకు కూడా అంతర్జాతీయ గుర్తింపు లభించేందుకు కృషి చేయాలి" అని చెప్పారు. ఈ సమావేశంలో సీసీఎల్ఏ జయలక్ష్మి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఏపీసీసీఎఫ్ శాంతిప్రియ పాండే, అటవీ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్. శరవణన్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి ఫరిదా థంపాల్, ప్రముఖ శాస్త్రవేత్తలు రామ సుబ్రహ్మణ్యన్, డాక్టర్ గోల్డిన్ ఖుద్రోస్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చంద్రబాబు దుర్మార్గాలను గట్టిగా ఎదుర్కోవాలి

-మొదటిపేజీ తరువాయి

ఇతర నాయకులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. "మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల ఏపీలోని అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా చంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాలి, ఈ దుర్మార్గాలను ఆపగలగాలి. ఇందులో భాగంగా మనం రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు చేస్తున్నాం. పార్టీ అనుబంధ విభాగాలు అన్నీ దీనిపై చిత్తశుద్ధిగా పనిచేయాలి. పార్టీ సంస్థాగత నిర్మాణంలో ప్రధానంగా అనుబంధ విభాగాలు పటిష్టంగా ఉండాలని వైఎస్ జగన్ ఆలోచించి అందుకు అనుగుణంగా స్ట్రక్చర్ నిర్మించారు

**చంద్రబాబు సర్కారు దుర్మార్గాలను సమర్ధంగా ఎదుర్కోవాలి: సజ్జల**

..క్షేత్రస్థాయిలో కూడా మన అనుబంధ విభాగాలు ఫోకస్డ్‌గా పనిచేయాలి. ప్రధానంగా 7 అనుబంధ విభాగాలు కీలకపాత్ర పోషించాలి. పార్టీ లైన్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి అనుబంధ విభాగాలదే ప్రధాన పాత్ర. మన సొసైటీకి ఎలా మంచి చేయాలని తపన పడే నాయకుడు జగన్. మనం



ఎక్కడా అబద్దాలు చెప్పాల్సిన అవసరం లేదు. మన పార్టీకి కోట్లాది మంది సైన్యం సిద్ధంగా ఉంది. అందరినీ సంఘటితం చేయాలన్న ప్రయత్నంలో భాగంగా ఈ కసరత్తు చేస్తున్నాం. మనం ఇప్పటికే మండల స్థాయి కమిటీలలో ఉన్నాం. ఇక గ్రామస్థాయికి వెళ్ళబోతున్నాం. డేటా ప్రొఫైలింగ్ చేస్తూ ముందుకెళుతున్నాం. దీనిపై అందరూ సీరియస్‌గా దృష్టిపెట్టాలి. వైఎస్సార్‌సీపీ అంటే 18 నుంచి 20 లక్షల క్రియాశీల క్షేత్రస్థాయి నాయకత్వం ఉంటుంది. వీరందరి డేటా ప్రొఫైలింగ్‌ను మనం సరిగా నమోదు చేయగలిగినప్పుడే మనం అనుకున్న ఫలితాలను అందుకోగలుగుతాం. అందుకు అందరూ సిద్ధంగా ఉండాలి, ఈ ప్రక్రియకు అవసరమైన సపోర్ట్ సిస్టమ్‌ను మనం అందుబాటులోకి తెచ్చుకోవాలి. అన్ని విభాగాల మధ్య సమన్వయం చేసుకోవాలి. పార్టీ అనుబంధ విభాగాల కమిటీల నిర్మాణంలో అలసత్వం వద్దు. ఉత్సాహం, తపన, బాధ్యతతో పనిచేయాలని ముందుకొచ్చేవారిని గుర్తించి వారికి కమిటీలలో ప్రాధాన్యతనివ్వాలి. ఏపీలో నకిలీ మద్యం ఏరులై పారుతుంది. వైఎస్ జగన్ హయాంలో డెలివరీ సిస్టమ్, డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ చక్కగా ఏర్పాటు చేసి ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తే చంద్రబాబు మాత్రం రివర్స్ పాలన సాగిస్తున్నారు. గతంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని చక్కగా చేశాం. ఇప్పుడు జరుగుతున్న రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలతో పాటు కమిటీల నియామకాలు కూడా పూర్తి చేద్దాం. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో అనుబంధ విభాగాలు క్రియాశీలకంగా ఉండాలి. పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలి" అని సజ్జల పేర్కొన్నారు.

# లిక్కర్ స్కామ్ వైసీపీ వైపు టర్న్ అవుతుందా?

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో కల్తీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ చుట్టూ ఉచ్చు బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది. జోగి రమేష్ ఈ కేసులో ప్రధాన కారకుడుగా ఏ1 నిందితుడు జనార్ధన్ రావు చేసిన ఆరోపణలు ఇప్పుడు ఫ్యాన్ పార్టీని షేక్ చేస్తున్నాయి. తాను వైసీపీ హయాంలోనే నకిలీ మద్యాన్ని తయారు చేశానని జనార్ధన్ రావు ఎక్సైజ్ విచారణలో తెలిపారు. అలాగే టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తాను ఆ కార్యక్రమాన్ని మానేశానని చెప్పుకొచ్చారు. అయితే జోగి రమేష్ ఫోన్ చేసి టీడీపీ ప్రభుత్వాన్ని రాజకీయంగా ఇరకాటంలో పెట్టేందుకు తిరిగి నకిలీ మద్యం తయారు చేయాలని చెప్పడంతోనే తాను తిరిగి ఈ పనికి పూనుకున్నానని నిందితుడు జనార్ధన్ రావు చెప్పడం వైసీపీని ఇబ్బందుల్లోకి నెట్టేలా కనిపిస్తుంది.ములకలచెరువు మద్యం కల్తీ మద్యం కేసులో జనార్ధన్ రావు సంచలన విషయాలు వెల్లడించారు. జనార్ధన్ రావు వీడియో ఒకటి బయటకు రావడంతో సంచలనంగా మారింది. మాజీ మంత్రి జోగి రమేష్ ప్రోద్బలంతోనే తాను నకిలీ మద్యం తయారు చేశానని, టీడీపీ అధికారంలోకి రాగానే ఆపానని జనార్ధన్ రావు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. తనకు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జోగి రమేష్ ఫోన్ చేసి నకిలీ మద్యాన్ని తయారు చేయాలని కోరినట్లు జనార్ధన్ ఎక్సైజ్ అధికారుల విచారణలో తెలిపినట్లు ఆ వీడియోలో జనార్ధన్ రావు చెప్పడాన్ని బట్టి చూస్తే జోగి రమేష్ చుట్టూ కల్తీ మద్యం ఉచ్చు ఆయన చుట్టూ బిగుసుకుంటుందని చెప్పొచ్చు. మరొకవైపు జనార్ధన్ రావు ఫోన్ పోయిందని చెప్పినా సిమ్ ను యాక్టివ్ చేసే పనిలో ఎక్సైజ్ అధికారులున్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నకిలీ మద్యం కేసులో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మొన్ననే జోగి రమేష్ అన్నారు. కొందరిని ఇరికించే కుట్ర చేస్తున్నారని ఆయన అన్నారు. దానికి తగినట్లుగానే జనార్ధన్ రావు కూడా జోగి రమేష్ పేరు చెప్పడంతో ఆయనను విచారించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. జోగి రమేష్ ను ఎప్పుడైనా అదుపులోకి తీసుకోవచ్చన్న ప్రచారం జరుగుతుంది. 2021లోనే విజయవాడకు సమీపంలోని ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారు చేశానని జనార్ధన్ ఒప్పుకోవడం, జోగి రమేష్ ప్రమేయం ఉందని చెప్పడంతో నకిలీ మద్యం కేసు వైసీపీ వైపు టర్న్ అయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తుంది. వైసీపీ నేతలు మాత్రం జనార్ధన్ రావు వీడియో చూస్తుంటే కుర్చీలో కూర్చోబెట్టి కావాలని చెప్పించినట్లు కనపడుతుందని అంటున్నారు. తమపై బురదను కడుక్కోలేక వైసీపీపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

**చాట్ లీక్... కలకలం**

ఆంధ్రప్రదేశ్‌లో నకిలీ మద్యం కేసు మరో సంచలన ఘట్టానికి చేరుకుంది. ఈ కేసులో ఏ1 నిందితుడు జనార్దన్ రావు , మాజీ మంత్రి జోగి రమేష్ మధ్య జరిగిన వాట్సాప్ చాట్ లీక్ అవ్వడంతో ఈ వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. ఈ చాట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, రాజకీయ వర్గాల్లో పెను కలకలం సృష్టిస్తోంది.

**చాట్‌లో వెల్లడైన సంచలన విషయాలు**

వాట్సాప్ చాట్ ప్రకారం.. వైసీపీ పాలనలో జోగి రమేష్ ఆధ్వర్యంలోనే నకిలీ మద్యం తయారీకి పాల్పడినట్లు నిందితుడు జనార్దన్ రావు అంగీకరించాడు. ఈ చాట్‌లో బయటపడిన కీలక అంశాలు ఇవీ.వ్యాపారం ఆపమని ఆదేశం: టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, జోగి రమేష్ ఆదేశాల మేరకే నకిలీ మద్యం వ్యాపారం ఆపేశామని జనార్దన్ రావు వెల్లడించారు.తిరిగి ప్రారంభించమని ఆదేశం: ఏప్రిల్ 2025లో జోగి రమేష్ ఫోన్ చేసి, "టిడిపి ప్రభుత్వంపై చెడ్డపేరు తెచ్చేలా మళ్లీ తయారీ మొదలు పెట్టు" అని చెప్పినట్లు చాట్‌లో స్పష్టంగా ఉంది. తంబళ్లపల్లి నియోజకవర్గంలో సూచన: అక్కడి నుంచి మొదలుపెడితే చంద్రబాబు ప్రభుత్వంపై బురద జల్లవచ్చు అని జోగి రమేష్ సూచించినట్టు వివరించారు.వేర్వేరు పేర్లతో గదులు అద్దెకు తీసుకుని, మద్యం తయారీకి యంత్రాలు ఏర్పాటు చేశారు. దీని తర్వాత సాక్షి మీడియా ముందు ఉంచి లీక్ ఇచ్చి రైడ్ చేయించడం, తద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే ప్లాన్‌ను ఈ చాట్‌లో స్పష్టంగా వెల్లడించారు.జనార్దన్ రావు ఫిర్యాదు ప్రకారం, జోగి రమేష్ చిన్నప్పటి పరిచయాన్ని అడ్డుపెట్టుకుని నమ్మించి మోసం చేశాడని పేర్కొన్నాడు. అలాగే, ఈ వ్యవహారంలో జై చంద్రారెడ్డికి అసలు సంబంధం లేదని స్పష్టం చేశాడు.

**జోగి రమేష్ స్పందన..**

ఈ వ్యవహారంపై జోగి రమేష్ మొదట స్పందిస్తూ, జనార్దన్ రావు ఎవరో తనకు తెలియదని, తనపై కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఆ తర్వాత, పరిచయం ఉన్నప్పటికీ స్నేహితుడేమీ కాదని, జనార్దన్ తన ఇంటికి రాలేదని, సంబంధం లేని విషయాలను వెల్లడించాడని తెలిపారు.ఈ కేసును దర్యాప్తు చేయడానికి ఏలూరు రేంజ్ ఐజీ నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయబడింది. సిట్ అధికారులు ఇప్పటికే సీసీ ఫుటేజీలను సేకరించినట్లు సమాచారం. జోగి రమేష్‌పై ఆరోపణలు, అసలు కుట్రదారులు ఎవరు అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

రాజకీయ పరిణామాలు, ప్రభుత్వం స్పందన

మాజీ మంత్రి జోగి రమేష్ పేరు తెరపైకి రావడం, ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి కుట్ర జరిగిందన్న ఆరోపణలు రాజకీయ వర్గాల్లో పెద్ద సంచలనం సృష్టించాయి. ప్రభుత్వం ఈ వ్యవహారంపై కఠినంగా ఉండాలని, ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉన్నా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది.నకిలీ మద్యం కేసు రాజకీయంగా పెను దుమారం రేపనుంది. జనార్దన్ రావు?జోగి రమేష్ చాట్ లీక్, ఇతర సాక్ష్యాలు సిట్ దర్యాప్తుకు మార్గం చూపుతున్నాయి. ఈ కేసులో వచ్చే రోజుల్లో రాజకీయ పరిణామాలు, అధికారుల చర్యలు రాష్ట్రంలో ప్రధాన అంశాలుగా మారనున్నాయి.

## ఏపీ బ్రాండ్ పునరుద్ధరణతోనే భారీ పెట్టుబడులు

-మొదటిపేజీ తరువాయి

సంస్థను సంప్రదించి...నిరంతరం ఫాలో అప్ చేయడం వల్లే లక్ష్యాన్ని చేరుకున్నామని సీఎం అన్నారు. ఢిల్లీలో గూగుల్ సంస్థ నిర్వహించిన భారత్ ఏఐ శక్తి సదస్సులో పాల్గొన్న అనంతరం అమరావతికి చేరుకున్న సీఎం చంద్రబాబుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు శుభాకాంక్షలతో స్వాగతం పలికారు. థాంక్యూ సీఎం సార్, గూగుల్ కమ్స్ టు ఏపీ అంటూ సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నేతలతో సీఎం చంద్రబాబు కొద్దిసేపు ముచ్చటించారు.ఏఐ డాటా సెంటర్‌తో విద్య, వైద్య, వ్యవసాయంలో కీలక మార్పులుఏఐ డాటా సెంటర్ ఏర్పాటుతో విద్య, వైద్యం, వ్యవసాయం సహా అనేక రంగాల్లో కీలక మార్పులు వస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. ఇటువంటి సంస్థల రాకతో కలిగే మేలును ప్రజలకు వివరించాలని నేతలకు సూచించారు. సామాన్యులకు సైతం డేటా సెంటర్ ప్రయోజనాలేంటో తెలిసేలా అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రానికి వచ్చిన ఈ భారీ పెట్టుబడి తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని సీఎం సంతోషం వ్యక్తం చేశారు. '30 ఏళ్ల క్రితం ఐటీని ప్రోత్సహించినప్పుడు నాడు సమాజంలో ఆ రంగంపై ఇంత అవగాహన, చర్చ, పోటీ లేదు. కానీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి ఉన్న అవకాశాలను నాడు ఊహించి ప్రణాళికలు అమలు చేశాం. దీనికోసం అనేక విమర్శలను కూడా ఎదుర్కొన్నాం. నాడు ముఖ్యమంత్రులు కంపెనీల కోసం విదేశాలకు వెళ్లి పెట్టుబడులు ఆకర్షించిన సందర్భాలు లేవు. అయితే విదేశాల్లో తిరిగి, దావోస్ పెట్టుబడుల సదస్సులకు వెళ్లి పరిశ్రమలు తెచ్చేందుకు పయత్నాలు చేశాం. అనేక ప్రయత్నాలతోనే హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ సహా అనేక కంపెనీలను తెచ్చి ఐటీకి పునాది వేశాం. నాడు మైక్రోసాఫ్ట్ రాకతో హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చేసింది. అనేక కంపెనీలు రావడానికి నాడు మైక్రోసాఫ్ట్ కారణం అయ్యింది. నేడు విశాఖకు వస్తున్న గూగుల్ ఏఐ డాటా సెంటర్ పెట్టుబడి కూడా అంతే ప్రభావాన్ని చూపుతుంది. విశాఖను ఐటీ హబ్‌గా చేసేందుకు మనం చేస్తున్న ప్రయత్నాల్లో ఇదో పెద్ద ముందడుగు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

## సమిష్టి కృషివల్లే రాష్ట్రానికి గూగుల్ రాక

**అమరావతి:** చరిత్ర సృష్టించాలన్నా, తిరగరాయాలన్నా కేవలం చంద్రబాబునాయుడు వల్లే సాధ్యమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ఉండవల్లి నివాసంలో బుధవారం ఉదయం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... చంద్రబాబుగారు 2014-19 నడుమ ఇండియా లార్జెస్ట్ ఆటోమోటివ్ ఎఫ్ డిఐ కియా తెచ్చారు. ఇప్పుడు ఆ చరిత్రను తిరగరాస్తున్నాం. ఇండియా సింగిల్ లార్జెస్ట్ ఎఫ్ డిఐ ఇన్వెస్టిమెంట్ ఇన్ హిస్టరీ, ఎపిలో గూగుల్ 15బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడుతుంది. అమెరికా వెలుపల గూగుల్ లార్జెస్ట్ డేటా సెంటర్ ఇది. అనేక దేశాలు, రాష్ట్రాల్లో అధ్యయనం చేసి ఎపికి వెళ్తేనే స్పీడ్ ఆఫ్ డూయింగ్ వల్ల పెట్టుబడి పెట్టగలం, ఇబ్బంది ఉండదని గ్రహించి వారు రాష్ట్రానికి వచ్చారు. గూగుల్ రాక ఎపి గెలుపు కాదు, భారతదేశం గెలిచింది. గతంలో మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ రూపురేఖలు మార్చినవిధంగానే... ఇప్పుడు గూగుల్ విశాఖ రూపురేఖలు మార్చబోతోంది. ఇది కేవలం ఒక్క డాటా సెంటర్ గురించి మాత్రమే కాదు. కేబుల్ ల్యాండింగ్ స్టేషన్, రెన్యువబుల్ ఎనర్జీ, ఎఐకి సంబంధించి అనేక అనుబంధ కంపెనీలు విశాఖకు వస్తాయి. కొన్ని నివేదికల ప్రకారం దీనిద్వారా 25రెట్ల ఆర్థిక ప్రభావం ఉంటుంది. అలాంటి ఎకనమిక్ యాక్టివిటీ గూగుల్ చేయబోతోంది. ఈ ఒక్క పెట్టుబడివల్ల 1,88,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు లభిస్తాయి. స్థానిక ఆర్థిక వ్యవస్థపై అయిదేళ్లలో రూ.48వేలకోట్ల ప్రభావం చూపుతుంది.

## కర్నూలుకు ప్రధాని మోదీ

-మొదటిపేజీ తరువాయి

అనిత, అనగాని సత్యప్రసాద్, గుమ్మడి సంధ్యారాణి, అలాగే కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు అత్యంత శ్రద్ధగా, సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు, కార్యకర్తలు ఒకే బందంలా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ నియంత్రణ నుండి సభా ప్రాంగణం వరకు అన్ని అంశాలను సమగ్రంగా పర్యవేక్షించాలన్నారు. సూపర్ జీఎస్టీ %-% సూపర్ సేవింగ్స్ సభ దేశ ఆర్థికాభివద్ధికి, ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను ప్రజల ముందుంచే వేదిక. ప్రధానమంత్రి గారు ప్రజలతో నేరుగా మమేకమవుతారు. అందువల్ల ఈ సభను చారిత్రాత్మకంగా మార్చాలన్నారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ప్రజల్లోకి వెళ్లి సభ విజయవంతం కావడంలో పాత్ర వహించాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి మండలంలో ప్రజల్లో ఉత్సాహం నింపి, ప్రధానమంత్రిని అద్భుత స్వాగతం పలుకుదాం. ఇది ఆంధ్రప్రదేశ్ అభివద్ధి పట్ల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే సభగా నిలవాలని అన్నారు. తదుపరి, సభా ప్రాంగణం, వేదిక, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్, నీటి సదుపాయం, మీడియా సౌకర్యాలు, వాలంటీర్ వ్యవస్థ వంటి అంశాలపై విస్తతంగా సమీక్షించారు. సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ప్రధాని పర్యటన రాష్ట్రానికి మరో కొత్త అవకాశాల ద్వారాలు తెరుస్తుంది. ఈ కార్యక్రమం కేవలం ఒక సభ కాదు, ఆంధ్రప్రదేశ్‌లో అభివద్ధి యాత్రకు నూతన దిశా నిర్దేశం చేసే ఘట్టం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సభ విజయవంతం కోసం అందరూ ఒకే తాటిపై నిలిచి, సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, నంద్యాల, కర్నూలు జిల్లా కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని నేతలకు పిలుపునిచ్చారు.

## దిశా, దశ మార్చే నవంబర్ నెల

**విశాఖపట్టణం :** నవంబర్ నెల.. ఏపీకి అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది. ఆంధ్రప్రదేశ్ దశ, దిశ మార్చేలా నవంబర్ నెలలో అడుగులు పడనున్నాయి. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్న సంగతి తెలిసిందే. అయితే అన్నింటికంటే ముందుగా టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటు కోసం ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. విశాఖలో టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. నవంబర్ నెలలో విశాఖ వేదికగా టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. అలాగే కాగ్నిజెంట్ కూడా క్యాంపస్ ఏర్పాటు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగ అభివృద్ధిలో నవంబర్ నెల కీలకంగా మారనుంది. నవ్యాంధ్రకు పెట్టుబడులను ఆకర్షించేందుకు ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. దీంతో దిగ్గజ సంస్థల చూపు ఏపీ వైపు మళ్లుతోంది. ఈ క్రమంలోనే ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థలు గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. అందులో కొన్ని ప్రాజెక్టులు వేగంగా అడుగులు పడుతున్నాయి కూడా. అయితే నవంబర్ నెల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దశ, దిశను మార్చేలా కనిపిస్తోంది. రెండు కీలక ప్రాజెక్టులకు నవంబర్ నెలలో శ్రీకారం చుట్టనున్నారు. విశాఖపట్నంలో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు అన్నింటికంటే ము?ందుగా ఆసక్తి చూపించింది టీసీఎస్.. ఆ తర్వాతనే ఒక్కొక్క కంపెనీ ఏపీవైపు, అందులోనూ విశాఖవైపు దృష్టి సారిస్తూ వచ్చాయి. ఈ క్రమంలోనే నవంబర్ నెలలో టీసీఎస్ తన కార్యకలాపాలు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.విశాఖపట్నంలో టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతో తొలుత ఒప్పందం చేసుకున్నది కూడా టీసీఎస్ కావటం విశేషం. ఇక టీసీఎస్ కోసం రుషికొండ సమీపంలోని ఐటీహిల్స్‌పై భవనాన్ని కూడా ఏపీ ప్రభుత్వం కేటాయించింది. హిల్-3లోని మిలీనియం టవర్స్ లీజు ప్రాతిపదికన కేటాయించింది. ఈ భవనంలో ఉద్యోగులు పనిచేసేలా ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ ఏర్పాట్లు కూడా తుది దశకు చేరుకున్నాయి. నవంబర్ నెలలో విశాఖ వేదికగా టీసీఎస్ కార్యకలాపాలు మొదలుపెట్టనుంది. ఈ విషయాన్ని ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కూడా తెలిపారు.టీసీఎస్ క్యాంపస్‌లో తొలిదశలో 2 షిఫ్టులలో 2000 మంది ఉద్యోగులు పనిచేస్తారు. ఆ తర్వాత ఉద్యోగుల సంఖ్యను క్రమంగా ఆరు వేలకు పెంచాలనే ఆలోచనలో ఉన్నారు. అందుకు తగ్గట్లుగా మిలీనయం టవర్స్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ఈ భవనం నుంచి తాత్కాలికంగా కార్యకలాపాలు సాగిస్తూనే.. టీసీఎస్ శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. రూ.1,370 కోట్లతో 12000 మందికి ఉపాధి కల్పించనుంది. టీసీఎస్ క్యాంపస్ కోసం ఏపీ ప్రభుత్వం ఐటీహిల్-3పై 22 ఎకరాలను కేటాయించింది. ఎకరా 99 పైసలకు చొప్పున కేటాయింపులు చేశారు.మరోవైపు టీసీఎస్ బాటలోనే మరో ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ కూడా విశాఖలో పెట్టుబడులు పెట్టనుంది. రూ.1,582 కోట్లతో విశాఖలో కాగ్నిజెంట్ క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతోంది.

## మండలంలో 13 మంది ఉపాధ్యాయులు నియామకం



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 15:**
మండలంలో నూతనంగా 13 మంది ఉపాధ్యాయులు నియమించబడ్డారు, ఇటీవల జరిగిన డీఎస్సీలో మండలానికి 13 మంది ఉపాధ్యాయులను కేటాయించినట్లు ఎంఈఓ కేశవరెడ్డి తెలిపారు. దీంతో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ భర్తీ జరిగినట్లు అయింది కాగా మరిన్ని పాఠశాలల్లో ఏకోపాధ్యాయ బడులు ఉన్నాయని వాటిని సైతం ప్రభుత్వం భర్తీ చేస్తుందన్న ఆశాభావంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉన్నారు.

## 17న చారాల ఉన్నత పాఠశాలలో కబడ్డీ జట్ల ఎంపిక



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్15:**
చౌడేపల్లి మండలంలోని పంచాయతీ కేంద్రం అయినాచారాల ఉన్నతపాఠశాల లో ఈనెల 17న కబడ్డీజట్ల ఎంపికను నిర్వహిస్తున్నట్లు ప్రధాన ఉపాధ్యాయు రాలు రేణుక తెలిపారు. ఎస్‌జిఎఫ్ఐ క్రీడల్లో భాగంగా పలమనేరు డివిజన్ స్థాయిలో అండర్ 14,17 బాల బాలికల కబడ్డీ టోర్నమెంటు ఎంపిక నిర్వహించ బడుతుందన్నారు. ఈ పోటీలో పలమనే రు డివిజన్ కు సంబంధించిన పది మండలాల నుంచి 44 జట్టులో పాల్గొంటారని తెలియజేశారు. అండర్ 17 బాల బాలికలు 55 కిలోలు లోపు బరువుకలిగి ఉండా లని అదేవిధంగా అండర్ 14 బాలురు 51 కిలోలు బాలికలు 48కి లోలు లోపు బరువు కలిగి ఉండాలన్నారు. అలాగే వారిని తీసుకువచ్చే ట్రైన్ మేనేజర్లు తప్పనిసరిగా ఫామ్ఏమిడ్‌డే మీల్స్ అక్విటెన్స్ తప్పకుండా తీసుకురావాలని తెలియజేశారు. ఈ సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు రాజేంద్ర బాబు మండల కోఆర్డినేటర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### విజ్ఞానోత్సవం వైపు అడుగులు రేణిగుంటలో

## చెకుముకి సంబరాల గోడపత్రిక విడుదల



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్15:**
రేణిగుంట బాలల పాఠశాలలో చెకుముకి సంబరాల గోడపత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చెకుముకి రేణిగుంట మండల అధ్యక్షుడు అల్లాబక్ష్, కార్యదర్శి కుప్పస్వామి, పి.ఎస్.టీచర్ నాగరాజు, హెచ్.ఎం శంకరి తదితరులు పాల్గొన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు,కార్యదర్శులు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా విద్యార్థుల్లో విజ్ఞానం,జిజ్ఞాస, శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించే దిశగా చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. లక్షలాది మంది విద్యార్థులు పాల్గొనే ఈ కార్యక్రమానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ ఏడాది చెకుముకి టాలెంట్ టెస్ట్ పాఠశాల స్థాయిలో అక్టోబర్ 18న, మండల స్థాయిలో నవంబర్ 1న, జిల్లా స్థాయిలో నవంబర్ 23న,రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 13,14,15 తేదీల్లో జరగనున్నట్లు వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చురుకుగా పాల్గొని విజ్ఞానోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన రెస్కో డైరెక్టర్

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 15:**



పలమనేరు శాసనసభ్యులు అమర్నాథరెడ్డిని కుప్పం విద్యుత్ సహకార సంస్థ (రెస్కో) డైరెక్టర్ గా నియమితులైన చంద్రశేఖర్ రెడ్డి మరియు వీ.కోట నాయకులతో కలసి బుధవారం సన్మానించారు. వీ.కోట మండలం చింతల ఎల్లాగరం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డిని రెస్కో డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. దీంతో పదవి రావడానికి దోహదం చేసిన స్థానిక ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గతంలోనూ చంద్రశేఖర్‌రెడ్డి రెస్కో డైరెక్టర్గా పనిచేసిన అనుభవం ఉండడంతో రైతుల సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు సూచించారు. అదేవిధంగా ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీ.కోట మండల నాయకులు రామచంద్ర నాయుడు, రంగనాథ్, రాంబాబు, సోమశేఖర్, సతీష్, లక్ష్మణ్, మురుగేష్, జనార్ధన్, తదితరులున్నారు.

## శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం పున ప్రారంభమునకు

### 10లక్షల విరాళం అందజేసిన ముత్యం బాలాజీ

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 15:**



పలమనేరులో శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణం అభివృద్ధి పనుల లో భాగంగా పలమనేర్ వాస్తవ్యులు లేట్ మత్యం కుప్పస్వామి, మత్యంకుమారి కుమారుడు మత్యం బాలాజీ 10 లక్షలు విరాళంగా ఆలయ కార్యనిర్వహణాధి కారి కమలాకర్ అందించారు. వారి కుటుంబానికి ఆలయ అర్చకులు కుమార్ గురుకుల్ రాఘవేంద్రస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించిస్వామి వారి ఆశీస్సులు శేష వస్త్రం అందజేశారు.

## శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు





**కల్లూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 15:**
పులిచెర్ల మండలం కల్లూరు ఇషార్ పెట్రోల్ బంక్ సమీపంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభి షేకం నిర్వహించి విశేషంగా అలంకరణ నిర్వహించారు. అనంతరం అర్చనలు, పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళారతి గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కల్లూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పుట్టా అనిల్‌కుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధికనే విధాల సహకరిస్తారని ఆలయంలో నిర్మించేమహా మండపానికి సిమెంటు సహకారం అందిస్తానని అన్నారు. పూల వ్యాపారి రమేష్ మాట్లాడుతూ ఆలయానికి అరటి ఒకటిన్నర అందిస్తానని అన్నారు. దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు కల్పించాలని ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు కోరారు.

## పోషకాహారం పై బాలింతలు , గర్భవతులు అవగాహన కలిగి ఉండాలి



**కల్లూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 15 :**
పోషకాహారం పై బాలింతలు గర్భవతులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు. అంగనవాడి 2 కేంద్రంలో బుధవారం 8వ రాష్ట్రీయ పోషణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు గర్భవతులు తీసుకోవాల్సిన పోషకాహారం పాటించవలసిన జాగ్రత్తలు ఆరోగ్య చికిత్సలు తదితరవాటిపై సమగ్రంగా అవగాహన కల్పించారు. అనంతరం పోషక పదార్థాలపై ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కరీముల్లా, సిర్ పి.మునీర్ అహ్మద్, ఉపాధ్యాయులు భారతి,ఆరిఫా,తులసి ప్రియ, ఏఎన్ఎం సరస్వతి మహిళా పోలీస్ రేష్మ, అంగన్‌వాడి కార్యకర్తలు అమృతకుమారి, పార్వతి, ధనలక్ష్మి, సింధుశ్రీ, శ్యామల, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ నాగమణి, ఆశాకార్యకర్త రేష్మ,అంగన్వాడి హెల్పర్ అస్మిత్,తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి

### ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, అక్టోబర్ 15:**
అన్నమయ్యజిల్లా పీలేరు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచే యాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. మండలాల పరిధిలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా నాయకులు అధికారులతో పిలిచి మాట్లాడారు అధికారులు నాయకులు సమన్వయం చేసుకొని కలుపుకు పోవాలన్నారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న తాగునీరు సమస్యపై అక్కడక్కడ పైపు లైన్లు పగిలి పోయి, సమస్య తలెత్తుతోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అన్ని పంచాయతీల పరిధిలో భూ సమస్యలు, ముటేషన్ సమస్యలు పెండింగ్లో ఉన్నాయని వాటిని పరిష్కరించే విధంగా చూడాలని నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే రాజకీయ ఒత్తిడి ఉండదని అధికారులు విధిగా మీ పరిధిలోని సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకో వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శివకుమార్ ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి సింగల్ విండో అధ్యక్షులు రెడ్డప్ప రెడ్డి, కోటపల్లి బాబు రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్లు కిషోర్ నాయుడు, కలప రవి, శ్రీనాథ్ రెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, కంచి సూరి, వసంతల, రాజా, లక్ష్మీకర్, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

## మరింత బాధ్యతతో పని చేయాలి

### ఆసుపత్రికి అవార్డు రావడంపై సూపరింటెండెంట్‌ను అభినందించిన ఎమ్మెల్యే

**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, సెప్టెంబర్ 15:**
పలమనేరు ఏరియా ఆసుపత్రిలో వైద్య సిబ్బంది. మరింత బాధ్యతతో పనిచేయా ల్సిన అవసరం



ఉందని పలమనేరు శాస నసభ్యులు అమరనాథరెడ్డి అభిప్రాయ పడ్డారు. స్థానిక ఆసుపత్రిలో స్వచ్ఛత, అందుతున్న సేవలకు గాను జిల్లా స్థాయి స్వచ్ఛత అవార్డు లభించింది. దీంతో ఆసు పత్రి సూపరిమింటెండెంట్ మమతారాణి, అభివృద్ధి కమిటీసభ్యులు నాగరాజు, సుధాకర్ రెడ్డి లు ఎమ్మెల్యేను బుధవారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించారు. అవార్డులు మనపై మరింత బాధ్యతను పెంచుతాయని కాబట్టి సేవా దృక్ప థంతో ఆసుపత్రిలో మెరుగైన సేవలందించి భవిష్యత్తులో మరిన్ని అవార్డులు వచ్చేందుకు కృషి చేయాలని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు మరియు సిబ్బంది ఉన్నారు.

## 2040లో చందమామపైకి భారత వ్యోమగామి

భారత అంతరిక్ష రంగ అభివృద్ధి కోసం అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపట్టినట్లు ఇస్రో చీఫ్ వీ నారాయణన్ తెలిపారు. వాటిలో 80 వేల కేజీలను మోసుకెళ్లే రాకెట్ల తయారీ, 2026లో వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపడం, 2035 నాటికి జాతీయ అంతరిక్ష కేంద్రం, చంద్రుడిపై అధ్యయనం కోసం వీనస్ ఆర్బిటర్ మిషన్ తయారీ వంటి లక్ష్యాలను ఏర్పరుచుకున్నట్లు వెల్లడించారు. అంతరిక్ష మిషన్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోబోటిక్స్ బిగ్ డేటా వంటివాటిని ఉపయోగించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 2040లో వికసిత భారత్ దూతగా భారతీయ వ్యోమగామి చందమామపై అడుగుపెట్టనున్నాడని నారాయణ్ తెలిపారు. 2027లో చేపట్టబోయే మానవసహిత అంతరిక్షయాత్ర మిషన్ ట్రాక్‌లో ఉందని వెల్లడించారు. 2040 నాటికి తొలి మానవసహిత చంద్రయానం చేపట్టాలని ప్రధాని దిశానిర్దేశం చేశారని.. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారేందుకు అంతరిక్ష కార్యక్రమంలో ఈ యాత్ర కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. చంద్రుడి ఉపరితల నమూనాలను భూమికి తీసుకొచ్చేందుకు 2027లో ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-4 ప్రయోగాన్ని చేపట్టనున్నట్లు ఇస్రో చీఫ్ తెలిపారు. కొన్నేళ్ల క్రితం అంతరిక్షరంగంలో రెండు లేక మూడు స్టార్టప్‌లు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం ఉపగ్రహ తయారీ, ప్రయోగ సేవలు, అంతరిక్ష ఆధారిత డేటా విశ్లేషణలపై అధ్యయం కోసం 300 కంటే ఎక్కువ స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని ఇస్రో చీఫ్ అన్నారు.

## ప్రాణాంతక ఇంజెక్షనా? ఉరిశిక్షా?



**దిల్లీ:** దేశంలో మరణశిక్ష పడిన ఖైదీలకు ప్రస్తుతం అనుసరిస్తున్న ఉరితీత విధానాన్ని తొలగించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై బుధవారం అత్యున్నత న్యాయస్థానం విచారణ జరిపింది. అయితే మరణశిక్ష అమలు విధానాన్ని మార్చే ఉద్దేశం లేదని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. దీనికి ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. కాలానుగుణంగా మార్పులను తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధంగా లేకపోవడమే ఇక్కడ సమస్య అని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌ను సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా దాఖలు చేశారు. కనీసం మరణశిక్ష పడిన ఖైదీకి.. ఉరితీతా? లేదా ప్రాణాంతక ఇంజెక్షనా? అని ఎంచుకునే అవకాశమైనా ఇవ్వాలని పిటిషనర్ కోరారు. "అమెరికాలోని 49 రాష్ట్రాలు మరణశిక్ష అమలులో ప్రాణాంతక ఇంజెక్షన్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. దీని వల్ల మరణ సమయంలో శిక్షపడ్డ నేరస్థుడికి తక్కువ వేదన ఉంటుందని ఇప్పటికే పలు అధ్యయనాల్లో తేలింది" అని పిటిషనర్ అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. పిటిషనర్ ప్రతిపాదనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి దాన్ని పరిగణించేలా చూడాలని ప్రభుత్వం తరపున వాదిస్తున్న న్యాయవాదికి సూచించారు. అయితే, పిటిషనర్ సూచన సాధ్యమయ్యేది కాదని.. దాన్ని ఇప్పటికే తమ కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు కేంద్రం తరఫు కౌన్సిల్ కోర్టుకు వివరించింది. ఇది విధానపరమైన నిర్ణయమని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఇందుకోసం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని గతంలో పరిశీలించినట్లు కోర్టుకు తెలిపారు. కేంద్రం సమాధానంపై ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తం చేసింది. "కాలానుగుణంగా ఎన్నో అంశాల్లో మార్పులు వచ్చాయి. కానీ, ప్రభుత్వం మాత్రం ఆ మార్పులను స్వీకరించేందుకు సిద్ధంగా లేదు. అదే ఇక్కడ సమస్యగా మారింది" అని వ్యాఖ్యానించింది. అయితే, ప్రస్తుతానికి దీనిపై తాము ఎలాంటి విధానపరమైన ఆదేశాలు ఇవ్వలేమని పేర్కొంది. అనంతరం ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను నవంబరు 11వ తేదీకి వాయిదా వేసింది.

## 57 మంది అభ్యర్థులతో జేడీయూ తొలి జాబితా



**పట్నా:** బీహార్‌లో నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. సీట్ల కేటాయింపు విషయంలో నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ)లో తర్జన భర్జనలు జరుగుతుండగా, ఇదే సమయంలో సీఎం నితీష్ కుమార్‌కు చెందిన జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) బుధవారం 57 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను విడుదల చేసింది. రాబోయే ఎన్నికల్లో పోటీ చేయబోయే కీలక అభ్యర్థుల్లో సోన్‌బార్సా నుండి రత్నేష్ సదా, మోర్వా నుండి విద్యాసాగర్ నిషాద్, ఎక్మా నుండి ధుమల్ సింగ్, రాజ్‌గిర్ నుండి కౌశల్ కిషోర్ ఉన్నారు. ఈ జాబితాలో పలువురు సీనియర్ నేతలు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న విజయ్ కుమార్ చౌదరి.. సరాయ్ రంజన్ నుంచి పోటీ చేయనున్నారు. ఆలంనగర్ నుంచి నరేంద్ర నారాయణ్ యాదవ్, బీహారీగంజ్ నుంచి నిరంజన్ కుమార్ మెహతా, సింగేశ్వర్ నుండి రమేష్ రిషి దేవ్, మాధేపురా నుండి కవితా సాహా, మహిసి నుండి గండేశ్వర్ షా, కుశేశ్వరస్థాన్ నుంచి అతిరెక్ కుమార్ ఎన్నికల బరిలోకి దిగనున్నారు. ఇతర ప్రముఖ అభ్యర్థుల విషయానికొస్తే అనంత్ కుమార్ సింగ్ (మొకామా), శ్యామ్ రజక్ (ఫుల్వారీ), కౌశల్ కిషోర్ (రాజ్‌గిర్), ధుమల్ సింగ్ (ఎక్మా), మహేశ్వర్ హజారీ (కళ్యాణ్‌పూర్), రత్నేష్ సదా (సోన్‌బర్సా), సంతోష్ కుమార్ నిరాలా (రాజ్‌పూర్), మదన్ సాహ్ని (బహదూర్‌పూర్), శ్రీష్వా సింఘ్‌పూర్‌పూర్), (గైఘాట్) విద్యా సాగర్ సింగ్ నిషాద్.. మోర్వా నుంచి పోటీ చేస్తున్నారు.

## త్వరలో వందేభారత్ 4.0

### కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

**ఇంటర్నెట్‌డెస్క్:** భారతదేశపు సెమీ-హై-స్పీడ్ రైళ్ల జాబితాలో తర్వాత వర్షన్ రానుంది. వందేభారత్ 4.0ను అభివృద్ధి చేయనున్నట్లు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం ప్రకటించారు. ఎగుమతి గిరాకీలకు అనుగుణంగా దాని రూపకల్పన ఉంటుందని వెల్లడించారు. రైళ్ల ఆధునిక సాంకేతికత విషయంలో దేశాన్ని గ్లోబల్ సప్లయిర్‌గా మార్చేదిశగా ఇది కీలక అడుగు కానుందని వెల్లడించారు. సీఐఐ ఇంటర్నేషనల్ రైల్ కాన్ఫరెన్స్‌లో కేంద్రమంత్రి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం రైల్వేల అభివృద్ధిపై బలంగా దృష్టి సారించిందని వెల్లడించారు. 11 ఏళ్లలో 35,000 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్‌ల నిర్మాణం జరిగిందని చెప్పారు. జపాన్ బుల్లెట్ రైల్ నెట్‌వర్క్ మాదిరిగానే హైస్పీడ్ ప్యాసింజర్ రైల్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు చెప్పారు. గరిష్ఠంగా గంటకు 350 కి.మీ వేగంతో రైలు ప్రయాణించేలా వాటి డిజైన్ ఉంటుందని తెలిపారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143